# ఈ ప్రేమలోకంలో

## ఎవరి ప్రేమలు వారివి అను ఒకానొక టూకీ కథ

రెండు పాములు (అఫ్‌కోర్సు, ఆడా, మగా) ప్రేమించుకుంటున్నాయిట. ఓ మధ్యాహ్నం మొగలి పొద నీడలో అవి బుస బుస ముద్దులాడుకొని సరసర పెనవేసుకుపోయి మిలమిల మెరిసిపోయేయిట. ఆ సమయంలో వాటిని చూసిన ఓ కప్పకవి ముగ్ధురాలైపోయి, ఎంతెంతగానో మురిసిపోయి, "ఆహా, ఈ లోకమంతా ప్రేమమయం - అవునవును ప్రేమమయం" అని గొంతెత్తి బెకబెక పాడిందట. మొగలి పొద నీడంతా ఆ విధంగా తెప్పలుగ ప్రేమమయ మయిందనే సుగమ సంగీతం వినగానే పదివేల కప్పలు అక్కడికి చకచక బెకబెక చేరాయిట. అంతలో ప్రేమ పరిష్వంగం నుంచి విడిపోయిన ఆ జంట పాములకు జాయింటుగా ఆకలేసిందట. దాన్తో ఆ పాముల జంట కప్ప కవితో సహా దొరికినన్ని కప్పల్ని వేర్వేరుగా భుజించి సుఖించేశాయట. దొరకని కప్పలప్పుడు పాముల ప్రేమ ఏదైనా కావచ్చుకాని కప్పల యెడల ప్రేమ మాత్రం అది కాదు కాదని తెలుసుకున్నాయట.

టెంపరరీగా ఆలు మగలైన రెండుకప్పల కామ ప్రేమని తిలకించిన ఓ తూరీగ కవికుల తిలకుడుకూడా కవ్వించబడినవాడై రెచ్చిపోయినవాడై, జగమంతా ప్రేమమయం మయం మయం ప్రేమమయం అని పాడిపాడి పాపాలు కడిగేసుకుని శుభుడై శాంతుడై సర్వ జగన్మిత్రుడై చివరికి ఓ లేలేత కప్పచేత భక్షింపబడ్డాట్ట. 'సత్యం తెలియని తూరీగ చచ్చిం'దనే సామెత అప్పటి నుంచే పుట్టిందట.

ఓ పులితల్లి పురిటి నొప్పులు పడ్డంచూసి "అయ్యో ఈ లోకంలో బాధలందరికీ సమానమే కదా, కష్టమయమైన లోకాన్ని ప్రేమమయం చేయవలసిందే కదా" అనే పుణ్యం చింతతో, కళ్ళ నిండా జాలి నింపుకుని, భయాన్ని జయించుకుని, జాతిద్వేషాన్ని రూపుమాపుకొని ఆ పులితల్లి సాయానికి వెళ్ళిన ఓ మేకతల్లి ఆ పులి కడుపులోంచి మూడు పులి పిల్లల్ని భద్రంగా సులభంగా తల్లికి ఏ నొప్పి కలక్కుండా బైటకి తీయడంతో అది చూసి మిక్కిలి సంతసించిన భగవంతుడు ఆ మేక తల్లిమీద పూలవర్షం కురిపించబోయేట్ట. కాని అంతలో ఆ పులితల్లి ఆ మేక తల్లిని తినేసి కడుపు నింపుకుని తన వెచ్చని పాలతో తన పిల్లల కడుపులు నింపి వాటిని ప్రేమగా ముద్దులాడుతుండగా భగవంతుడు పుష్పించిన వర్షం పులితల్లీ పిల్లల్ని పునఃపునః పులకరింతల్లో ముంచిందట.

ఓ గ్రామంలో ఓ షావుకారు ఓ పంచదార మిల్లు లేపి, కూలీలకి, కాణీ కాణీ జీతాలిచ్చి మిల్లు నడిపిస్తుండగా మొదట్లో అతనికి కొంత నష్టంరాగా, అతను కూలీలని "సోదరులారా"

అని నోరారా పిల్చి "ఈ పంచదార సంస్థ నాలుక్కాలాలు నిలబడి మీరు, నేను కూడా బాగుపడాలంటే మీరు కొన్నాళ్ళయినా ఎలాగయినా బాధపడయినా నేనిచ్చే కాణీల్ని వదులుకొని నేనివ్వబోయే దమ్మిడీల్ని పుచ్చుకొని పని చేయరా సోదరులారా?" అని పరమ సోదర ప్రేమతో అతి జాలిగా బతిమాలుకోగా, అతని మాట తీపికి ముగ్ధులైపోయి, కంటి నీటికి జాలిపడిపోయి సోదర ప్రేమకి పులకించిపోయిన కూలీలు దమ్మిడీలతోనే దినాలు వెళ్ళబుచ్చుకొందికి వప్పుకొని పని చేయగా చేయగా 'చావుకారు చోదరుడికి నచ్చల్నచ్చలు నాబాలు గుమ్మరించేసినయ్ కదా, మరప్పుడు మా కాణీ జీతాల మాటేటని "కూల్లంజకొడుకు" లడిగితే అడగడమేకాదు ఘోరం ఘోరంగా సమ్మెలూ సత్యాగ్రహాలు కూడా చేస్తే "షావుకారు వాళ్ళకి మక్కలిరగొట్టించడా మరి! దిక్కున్నచోట చెప్పుకోండొసె అనడా మరి!" చావుకార్ని ప్రేమించే కూలీల గతి "ఆ కరువుకు ఏటవుద్దో ఆడే మనకి తెలియ జేప్పడా మరి!"

అవును మరి, ప్రేమకి జాతులున్నవి కదా !

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 20-10-1972*